

‘‘ఈరోజు నుంచి నువ్వు మగాడివనే సంగతి మర్చిపో. నీ పేరు మార్చుకో... పద్ధతి మార్చుకో. ఓకే అయితే రేపు రాత్రికి వచ్చి చేరిపో.’’

★★★

ఆ పరుగెడుతున్న వ్యక్తి ‘శ్రీమతి’ అని నా సందేహం. అవునా... కాదా అని తటప టాయిస్తూ ఉండగానే హడా వుడిగా ఎదురుగా ఉన్న రూంలోకి వెళ్లిపోయాడు.

అప్పుడు సమయం రాత్రి పదకొండు గంటలు. స్థలం హైద్రాబాద్‌లో ఉన్న బహుళ అంతస్థుల భవనం.

# మిస్టర్ శ్రీమతి

## ఎన్. సూరి

గబగబా అతను వెళ్లిన రూం వైపు వెళ్లాను. లోపలికి వెళ్లడమా... మానడమా అని సందేహిస్తూ ఉండగా వాడే బయటకు వచ్చాడు. గుర్తుపట్టాను. వాడే సందేహం లేదు.

ఒక్కసారిగా వెర్రి కేక వేసి వాణ్ణి కౌగిలించుకున్నాను.

‘‘ఊరి నుంచి ఎప్పుడొచ్చావ్’’ నా పట్టు విడిపించుకుని అడిగాడు.

‘‘ఇవాళ పొద్దున్నే... అవును ఒళ్లంతా ఈ చెమటలేంటి... ఏం జరిగింది?’’

‘‘అదా లోపల ఓ చిన్న ఫైట్ చేసి వస్తున్నాలే!’’

‘‘ఏరా ఏంటి గొడవ?’’

‘‘ఏంలేదులే. ఇది మాకు ఆఫీస్ టైం. రేపు కలుద్దాం. నా ఫోన్ నెంబర్ తీసుకో’’ అంటూ నెంబరిచ్చాడు.

సెల్ నెంబర్లు ఇచ్చిపుచ్చుకున్నాక ఇద్దరం విడిపోయాం.

అన్నట్టు శ్రీమతి అసలు పేరు శ్రీపతి. చిన్నప్పట్నుంచి సరదాగా వాడ్ని శ్రీమతి అనిపిలవడమే అలవాటయ్యింది. నేను పిలిస్తే ఏమీ అనుకోడు. ఇంకెవరైనా అలా పిలిస్తే కోపం వస్తుంది.

ఇద్దరం ఒక ఊరివాళ్లమే. కలిసి చదువుకున్నాం. కాలేజీ వరకు అలాగే మరెవ్వరితోనూ కలిసేవాడు కాదు.

కారణం... వాడికి ఫ్యూబరో ఫోనియా.

కొత్తవాళ్లెవరైనా వాడి గొంతు విని ఉలిక్కిపడితే అదే పేరు చెప్పేవాడు. వాళ్లు సర్దుకునేంతలోనే వేరే టాపిక్‌లోకి వెళ్లిపోయేవాడు. వచ్చినపని చూసుకుని అవతలివాళ్లు వెళ్ళిపోయేదాకా హంగామా చేసేసేవాడు. ఏం తోచనిచ్చేవాడు కాదు.

చదువు పూర్తయింది. ఉద్యోగం కోసం హైదరాబాద్ చేరాడు. నేను మాత్రం హాపీగా మా టౌన్లోనే ఉండిపోయాను.

ఇక్కడికొచ్చాక ఒకటిరెండుసార్లు ఫోన్లు చేసేవాడు. తరువాత అదీ మానేశాడు. కారణం తెలీదు. ఎక్కడున్నాడో, ఏమయ్యాడో ఏమీ తెలీదు. నాక్కూడా పంతం వచ్చి వాడి సంగతి కనుక్కోవడం మానేశాను. ఇన్నాళ్లకు మళ్లీ కనిపిస్తే పలకరించకుండా ఉండలేకపోయాను. అయితే ఇప్పుడు వాడు చాలా ముభావంగానే ఉన్నాడు. ఇదివరకటి చనువు లేదు. నన్ను చూడగానే ఆప్యాయతకి బదులు ఏదో ఇబ్బంది కనిపించింది.

సెక్రటేరియెట్ దగ్గర నుంచుని ఫోన్ చేస్తే పావుగంటలో వచ్చాడు.

"వచ్చావా. నాపని ఇప్పుడే అయ్యింది. నీకు ఆఫీస్ టైం అయిపోతోందా?"

"లేదు. ఇవాళ సెలవు పెట్టాను."

"సరేపద. ముందేదైనా మంచి టీ తాగి..."

"ఛస్... ఈ టైంలో టీ ఏంట్రా... బైక్ ఎక్కు చెబుతాను" అంటూ నన్ను వెనక కూర్చోబెట్టుకుని బయల్దేరాడు. కొంతదూరం వెళ్లాక బైక్లో పెట్రోల్ పోయించుకుని 'చిల్లర లేదు... డబ్బులిచ్చేయ్' అన్నాడు. వెధవకి డబ్బంటే కక్కుర్తి జాస్తి. ఖర్చుపెట్టాలంటే ప్రాణం టపటపా కొట్టుకుంటుంది. తెలిసిన విషయమే కనక నేనేం పట్టించుకోలేదు. తర్వాత సుమారు గంట ప్రయాణం తర్వాత సిటీ అవుట్కట్స్లోకి ప్రవేశించాం. ఒకానొక గార్డెన్ రెస్టారెంట్ అండ్ బార్ ముందు బైక్ పార్క్ చేసి లోపలికి తీసికెళ్లాడు.

"ఇక్కడైతే హాపీగా మందుకొడుతూ అర్ధరాత్రి దాకా కబుర్లు చెప్పుకోవచ్చు.. ఏమంటావ్?" అన్నాడు.

"ఈ అలవాటు ఎప్పట్నుంచిరోయ్"

"ఈ ఉద్యోగంలో చేరిన దగ్గర్నుంచి."

ఇంకా ఏదో అడిగేలోపు వెయిటర్ వచ్చి నిలబడ్డాడు.

శ్రీపతి వాణ్ని చూస్తూనే సీరియస్గా మొహం పెట్టి, "నువ్వొద్దు... వేరే ఎవర్నైనా పిలువ్" అన్నాడు.

"నో ప్రాబ్లమ్ సార్... నాకు చెప్పండి నేను సర్వ్ చేస్తాను." అన్నాడతను నవ్వుతూనే.

"ఇడియట్... వద్దని చెప్తుంటే నీక్కాదూ"

"అలా అయితే మీ ఇద్దరు వేరే టేబిల్పై కూర్చోండి సార్." అంటూ వాడెళ్లిపోయాడు.. నవ్వుకుంటూనే.

టేబిల్ మారి కూర్చున్నాం.

"ఎవరైతే ఏముందిరా... పోనీ అక్కడే కూర్చునే వాళ్లం కదా:"

"మామూలుగా ఇక్కడెవడూ పిలిస్తే కూడా గంటసేపటికి గానీ రాడు. వీడు మాత్రం నేను వచ్చీరాగానే ఎక్కడున్నా పరిగెట్టుకుంటూ వచ్చేస్తాడు."

"రానీ. అది వాడి డ్యూటీ కదా!"

"నీకు తెలియదురా వాడు.. వాడూ మొదట్లో నాచేత జిన్ తాగించేవాడు" శ్రీపతి ఇంకా కోపంగానే ఉన్నాడు.

"జిన్కి సర్వర్కి సంబంధం ఏంట్రా"

"ఇడియట్ అది ఆడవాళ్లు తాగేది కదరా.."

వాడి సమాధానం విని టక్కున నాలుక్కరుచుకున్నాను.

కారణం... వాడికి ప్యూబరోఫోనియా.

మగవాళ్లలో ఆడగొంతు ఉండే లక్షణాన్ని వైద్య శాస్త్ర పరిభాషలో పిలిచే పేరది. ఈ లక్షణం వల్లనే శ్రీపతి ఎవరితోనూ కలిసేవాడు కాదు. చిన్నతనంలో కొంతమంది ఏడిపించేవారు. అది వాణ్ని పెంకివాడిగా తయారుచేసింది. ప్రతివాడితో గిల్లికజ్జాలు పెట్టుకునేవాడు. దాంతో ఎవరూ వాణ్ని దగ్గరికి రానిచ్చేవారు కాదు.

మరో వెయిటర్ని పిలిచాడు.

"చెప్పు నువ్వేం తాగుతావ్... నాకేం తాగిస్తావ్" అని అడిగాడు. వాడి కోసం ట్రిపుల్ ఎక్స్ రమ్ము, నాకోసం కూల్డ్రింక్, ఇంకా మంచూరియా కూడా ఆర్డరిచ్చాడు.

"సరే ఏంటి విశేషాలు.. ఎలా ఉన్నావ్... మన వాళ్లంతా ఎలా ఉన్నారు... నీ బిజినెస్ ఎలా ఉంది?" అంటూ ఏవేవో ప్రశ్నలడిగాడు. అన్నింటికీ సమాధానాలిచ్చాను.

పావుగంట తర్వాత వెయిటర్ బాటిల్ తెచ్చి ఓ పెగ్ పోసి వెళ్లిపోయాడు. మా ఊరి విశేషాలేవో అడుగుతూ మొదటి పెగ్ పూర్తి చేసి నిశ్చలంగా కూర్చున్నాడు. అప్పుడడిగాను.

"కనీసం ఫోన్ కూడా చేయడం కూడా మానేశావ్. ఇంతకీ ఏం చేస్తున్నావ్?"

"ఉద్యోగం."

"అదే ఏంటని?"

"తెల్సుకోవాల్సినంత పెద్ద ఉద్యోగం కాదులే. ఓ కాల్ సెంటర్లో పనిచేస్తున్నాను."

"కాల్ సెంటరా.. అంటే?"

"తెలుగులో చెప్పాలంటే సమాచార కేంద్రం. చేసేపని అంబలి తాగేవాడికి మీసాలొత్తడం."

"సరిగ్గా చెప్పరా."


"అవునురా. ఇన్కంటాక్స్ రిటర్న్స్ దగ్గరనుంచి నీ ఏణ్ణార్ధం కొడుక్కి కొనే నాపీపాడ్స్ వరకు ఏదైనా సరే ఇంట్లో కూర్చుని ఆర్డరిస్తే మేం చేసిపెడతాం. అణుబాంబు నుంచి ఆవకాయదాకా, భారీ పరికరాల దగ్గరనుంచి బ్రాసరీల దాకా నువ్వు ఏ వస్తువు తయారుచేస్తున్నా సరే, మాతో ఒక్కసారి డీల్ కుదుర్చుకుంటే చాలు. ప్రపంచంలో ఉన్న ప్రతివాడికీ ఫోన్ చేసి నీ బ్రాండ్ ఉత్పత్తి అంతగొప్పది, ఇంత గొప్పది అని సుత్తి కొడతాం. ల్యాప్టాప్లో బ్యాటరీ వేయడం దగ్గరనుంచి అలారం టైంపీస్లో బ్యాటరీ సెట్ చేయడం దాకా ఏ వస్తువైనా ఎలా వాడుకోవాలో నీకు తెలీకపోతే మాకు ఫోన్చేస్తే మేం చెప్తాం. ఇదే మా పని?"

"తెలిసేలా చెప్పరా అంటే"

"చెప్పేందుకేం ఉందిరా... సంప్రదాయ గుమాస్తాకి టెక్నాలజీ ముసుగు వేస్తే కాల్సెంటర్ ఎగ్జిక్యూటివ్ అవుతాడు. కాకపోతే ఇదివరకు కాయితాలతో కుస్తీ పట్టేవాళ్లు. ఇప్పుడు ప్రతిదానికీ ఫోన్లు. అంతే తేడా. ఎవరికైనా ఫోన్ చేసి ఆర్డర్లు తీసుకోవాలి. ఎవరైనా ఫోన్ చేస్తే కంప్లయింట్లు తీసుకోవాలి. లేదంటే వాళ్ల డౌట్లు తీర్చాలి. ఓ దేశం కాదు. ఓ రాష్ట్రం కాదు ప్రపంచ దేశాల్లో ప్రతివాడితోనూ వాడికర్థమయ్యే భాషలో, వాడికి నచ్చేలా మాట్లాడి చావాలి."

"అది సరే. నిన్న రాత్రి ఆ పరుగులేంటి... ఫైట్ అంటావేంటి?"

"అదా... ఆ పై ఫ్లోర్లోనే మా ఆఫీస్. కింద నువ్వు చూసింది రీక్రియేషన్ రూం. అందులో



బాక్సింగ్ కిట్ ఉంటుంది.''

''ఎందుకు?''

''ఎవడైనా కస్టమర్ విసుగెత్తించినప్పుడు వాడి మీద కసి తీర్చుకోడం కుదరదు కదా! అక్కడికి వెళ్లి కాసేపు బాక్సింగ్ చేస్తామన్నమాట. అవతలివాడ్ని తలుచుకుని బాక్సింగ్ బ్యాగ్‌ను నాలుగు బాదితే కాస్త రిలీఫ్ వస్తుంది. అదే ఫైట్ అంటే..''

''నీ బొంద అదేం పద్ధతి..''

''ఇప్పుడు అమెరికాలో ఈ పద్ధతి పెద్ద సక్సెసయ్యింది. ఇక్కడ ఇప్పుడిప్పుడే మొదలయ్యింది. అయినా ఆ కాస్త రిలీఫ్ కూడా లేకపోతే మూడోనాటికే ఈ ఉద్యోగాలు వదిలి పారిపోవాల్సి వస్తుంది.''

''సర్లే. ఇంతకీ ఈ ఉద్యోగం చాలా కష్టంగా ఉంటుందంటావ్..అంతేనా!''

శ్రీమతి కాస్తంత గంభీరంగా మారాడు. ఏదో చెప్పాలా వద్దా అన్న ఆలోచన మొహంలో స్పష్టంగా తెలుస్తోంది. రెండునిమిషాల మౌనం తర్వాత అన్నాడు.

''రోజులో పన్నెండు గంటలపాటు ఆడపిల్లగా మారిపోవాలంటే కష్టంకాక మరేమిటి?''

వాడేం చెపుతున్నాడో నాకేమీ అర్ధం కాలేదు. ఏంటని అడగబోయేంతలో వెయిటర్ వచ్చాడు. రెండో పెగ్ కలుపుతున్నాడు, 'స్ట్రాంగ్ గా కలపవోయ్' అని వెయిటర్‌తో చెప్పి, ''ఇంకేం తింటావు చెప్పు'' అని నన్ను అడిగాడు.

''కాసేపాగుదాం'' అన్నా.

వెయిటర్ వెళ్లిపోయాడు.

''ఇందాకా ఏంట్రా అన్నావ్... ఆడపిల్లలా మారిపోవాలా''

''అవును. సాధారణంగా కాల్‌సెంటర్‌లలో పని చేసేవాళ్లంతా విదేశాలకు ఫోన్‌చేసేటప్పుడు నేటివిటీకోసం తమ పేర్లు మార్చి చెబుతారు. కాకపోతే నేను మాత్రం ఏదో ఒక ఆడపేరు చెప్పాల్సి వస్తోంది.''

''ఎందుకు ... మగ పేరే చెప్పొచ్చుగా?''

''కుదరదు. ఆడపేరే చెప్పాలని మా ఎండీ కండిషన్ పెట్టిచచ్చాడు.''

''దేనికి?''

''వెధవా.. నీకు తెలుసు కదరా...'' అన్నాడు వాడు ఉడుక్కుంటున్నట్లుగా.

రెండోసారి నాలిక కరుచుకున్నాను. కారణం...వాడికి ఫ్యాబరో ఫోనియా. కాసేపాగి మళ్లీ వాడే చెప్పసాగాడు.

''నేను అబ్బాయినే అని చెప్పినా నమ్మరు. ఫోన్లో గొంతే తప్ప మొహం తెలియదు కదా.''

''సరే. ఆడపిల్లపేరే చెప్పావనుకుందాం. ఏమయ్యిందిప్పుడు?''

''ఏమవ్వడమేంటి... నీకు తెలియదా?''

''నిజంగా తెలియదు.''

''ప్రతిరోజూ ఇన్‌బౌండ్ కాల్స్ అయితే నాలుగొందలు..అవుట్‌బౌండయితే రెండొందలు...''

ఉక్రోషంగా బరువుగా విషాదంగా... ఇంకా రెండు మూడు ఎక్స్‌ప్రెషన్స్‌ని కలగలపుతూ శ్రీపతి చెప్పిన మాటలు సగం సగమే అర్ధమయ్యాయి. వాడివంక అయోమయంగా చూశాను.

వాడు మాత్రం ఇంకా ఆవేశంగా అప్పటిదాకా అక్కడే పెట్టేసిన గ్లాస్ అందుకుని గటగటా తాగేశాడు. ఘాటు తట్టుకోలేక ఓ పక్క నోరు ఆర్పుకుంటూనే ఉల్లిపాయ పరపరా నమిలేశాడు.

పరిస్థితి చక్కబడ్డాక మళ్లీ అడిగాను.

''నువ్వు చెప్పింది నాకు ఒక్కముక్క కూడా అర్థం కాలేదురా...నీబాధేంటో తెలీలేదు..''

''ప్రతిరోజూ నాలుగొందల మందితో ఫోన్లో మాట్లాడాలని చెప్తున్నాను.''

''మాట్లాడ్డం పెద్ద కష్టమేముందిరా?''

''ఇలా మాట్లాడితేనే నాకు మండేది. మామూలుగా మాట్లాడం కష్టం కాకపోవచ్చు. తిట్లు తింటూ కూడా నవ్వుతూ మాట్లాడం కష్టం కాదా?''

''తిడతారా... దేనికి?''

''వాళ్ల పని పాడుచేస్తే తిట్టరా? అయినా తిట్టడానికి ఓ కారణం ఏమిటి. ఇంట్లో పెళ్లాం మీద కోపం వచ్చినా కాల్‌సెంటర్‌కి ఫోన్ చేసి మాలాంటి వాళ్లని బలెయ్యడం ఫారిన్‌లో బాగా అలవాటు.''

''ఇదేం పిచ్చిరా బాబూ?''

''అంతే మరి... ఒకడికి మతపిచ్చి. ఒకడికి కులపిచ్చి. ఇంట్లో పేరెంట్స్‌లేని టీనేజ్ కుర్రాళ్లకి, వీకెండ్స్‌లో బ్యాచిలర్స్‌కి, పెళ్లాం లేచిపోయిన నడివయసు మగాళ్లకి మేమంటే అదేంటో తెగపిచ్చి.''

''అంటే వీళ్లందరి కాల్స్ అన్నీ ఓ ఆడపిల్లలా నువ్వు రిసీవ్ చేసుకోవాలన్నమాట. అటువంటి కాల్స్ ఎందుకు తీసుకోవడం. కట్ చేసేయొచ్చుగా.''

''ఊహూ... కంపెనీ రూల్స్ ఒప్పుకోవు. ఒకవేళ మనం కట్‌చేసినా ఇంకేదో వంకపెట్టి మరోసారి చేస్తాడు. ఓసారిలాగే ఓ కెనడా కుర్రాడు నా వాయిస్ చాలా స్వీట్‌గా ఉందని, పెళ్లంటూ చేసుకుంటే నీలాంటి అమ్మాయినే చేసుకోవాలని కలలు కంటున్నానంటూ పదేపదే ఫోన్ చేయడం మొదలెట్టాడు. వాడ్ని వదిలించుకునేసరికి నా తల ప్రాణం తోకకొచ్చింది.''

''మరి చేసేవాళ్లంతా ఈ ఉద్యోగాలు ఎలా చేస్తున్నార్రా?''

''వీటిల్లో నాలాంటి వాళ్లు ఒకరిద్దరు తప్ప ఎవరూ పర్మినెంటుగా ఉండిపోరు. టెంపరరీగా ఉండి మంచి ఉద్యోగం వెతుక్కుని వెళ్లిపోతారు. అందుకే కాల్‌సెంటర్లు పుష్పక విమానాల్లా ఎంత మంది వచ్చినా ఖాళీగానే ఉంటాయ్.''

''మరి నువ్వు ఎందుకు మానేయలేదు?''

''ఒకప్పుడు ట్రై చేశాను. మామూలు డిగ్రీలు చదువుకున్న మనలాంటి వాళ్ళక్కూడా వేలకివేలు జీతాలిచ్చే రంగం ఇదొక్కటే. అయినా ఏదో ఒకరకంగా డబ్బు సంపాదించాలంటే ఇలాంటివన్నీ మనసులో పెట్టుకోకూడదు.''


''వెధవ డబ్బుకోసం ఆరోగ్యాన్ని, జీవితాన్ని పాడుచేసుకుంటావా?''

''తప్పదు. ఒకటి కావాలంటే ఇంకోటి పోగొట్టుకోవాలి కదరా.''

ఈ విషయం ఇంతకంటే పెంచడం నాకు ఇష్టం లేదు. ''ఇప్పుడే వస్తానుండు'' అంటూ బాత్రూమ్‌కి వెళ్లొచ్చాడు వాడు.

వస్తూనే ''ఆ... ఏం తింటావ్ చెప్పు'' అనడుగుతూ వెయిటర్‌ని పిలిచాడు. బిర్యానీ, ఫ్రైడ్‌రైస్ తలొకటి ఆర్డరిచ్చాం. వాడు ముందు తెచ్చిన క్వార్టర్ పూర్తికాగా, మరో క్వార్టర్‌కి ఆర్డరిచ్చాడు.

''శ్రీమతీ! నీకు గుర్తుందా... చిన్నప్పుడు



క్లాసులో ఎవడినైనా ఏడిపించాలనుకుంటే వాళ్లింటికి ఫోన్ చేసి ఆడపిల్లలా మాట్లాడేవాడివి. ఇంట్లోవాళ్లు వాడ్ని చెడామడా తిడితే వాడొచ్చి నీ కాళ్లు పట్టుకునేవాడు. ఒకసారి మురళి వాళ్లింటికి ఇలాగే ఫోన్ చేస్తేనే కదూ! కథ పోలీస్ కంప్లయింట్ దాకా వెళ్లింది.''

''అవును నిజమే! బహుశా వాళ్లందరి శాపమే తగిలిందనుకుంటాను. అందుకే నా లైఫ్ ఇలా అయింది.'' అన్నాడు వాడు విచారంగా మొహం పెట్టి.

వాడు ఆ మాట అనేసరికి నాక్కూడా బాధనిపించింది. ఎందుకు గుర్తుచేశానా అని బాధపడ్డాను. మాట్లాడకుండా కూర్చున్నాను.

ఫుడ్ వచ్చింది. చికెన్ తింటూ మందు తాగుతూ చిత్రవిచిత్రమైన ఫీట్లు చేస్తున్నాడు వాడు. కాసేపు ఏవో కబుర్లు చెప్పుకుంటూ తినడం పూర్తి చేశాం. వాడు సగం బిర్యానీ కిందే పోసేశాడు. మందు మాత్రం చుక్క ఒలక్కుండా జాగ్రత్తగా తాగుతున్నాడు.

ఇంతలో సెల్ మోగింది. అటెన్షన్‌లోకొచ్చి ఫోన్ ఎత్తాడు. తెలుగులో కాకుండా హిందీలో మాట్లాడుతున్నాడు. నాకర్థం అయినంతవరకు వాడు మాట్లాడిన మాటలివి... ''ఊహూ... ఇంట్లో లేను. బయటికొచ్చాను. మా ఊర్నుంచి ఫ్రెండొస్తేనూ. చిన్న పార్టీ ఇస్తున్నాడు అందుకని. లేదులేదు అన్నీ సాఫ్ట్‌డ్రింక్సే. నిజం ఒట్టు... వద్దులే బాగోదు. నువ్వు మాట్లాడితే ఏమన్నా అనుకుంటాడు. నేను చెపుతున్నాను కదా! అబ్బెబ్బే నిజంగానే తాగట్లేదు. పన్నెండింటికల్లా ఇంటికెళ్లిపోతాను. ప్రామిస్. అబ్బా...పొద్దున్నే నేను రాలేను గానీ రేపు ఒక్కపూటకి బస్‌లో వచ్చేయ్. ఉంటా. అలాగే పెందరాళే ఇంటికెళ్లి పోతాను. బై.''

అప్పటికే వాడికి బాగా కిక్కు ఎక్కేసింది. మాట ముద్దముద్దగా వస్తోంది. అబ్బే ఏం తాగట్లేదంటే ఎంత ఫోన్ అయినా అనుమానం రాకుండా ఉంటుందా?''

''ఎవరి దగ్గరనుంచిరా ఫోను?''

వెంటనే సమాధానం చెప్పలేదు వాడు. ఏదో మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఎందుకో బాధపడుతున్నాడు వాడు. ''ఒరే నన్ను క్షమించరా.. ఇన్నాళ్ళూ నీ దగ్గర ఓ విషయం దాచాను'' అన్నాడు. కళ్లలోకి నీళ్లు ఉబికి వస్తుండగా.

వాడి మొహం చూసేసరికి నాకు జాలేసింది. ''పోనీలేరా'' అన్నాను ఓదార్పు ధోరణితో.

''కాదురా... నీతో చెప్పకపోతే నాకు మనశ్శాంతి ఉండదు.''

''ప్రతిరోజూ వందలమంది మగాళ్లతో మాట్లాడి... మాట్లాడి వాళ్ల తిట్లన్నీ వింటూనే ఉన్నాను కదా! అవతలివాడు ఓ ఆడపిల్లను తిట్టాననుకుంటూ నన్ను తిడతాడు. ఆ తిట్లన్నీ వినీవినీ మానసికంగా నన్ను నేను ఆడపిల్లగానే ఊహించుకోవడం మొదలుపెట్టాను. దాంతో రోజురోజుకీ నాకు ఆడవాళ్ల మీద ఆకర్షణ తగ్గుతూ వచ్చింది.''

''ఒరేయ్.. ఒరేయ్.. ఏమిట్రా ఇది... నామాట విని వెంటనే ఆ ఉద్యోగం మానేయ్.''

''నన్ను పూర్తిగా చెప్పనీరా. నేనూ మానేయాలనే ప్రయత్నించాను. కానీ అప్పటికే మానసికంగా నేను ఆడపిల్లగా మారిపోయానురా. సంసారానికి పనికిరాకుండా పోతేనేమోనని భయం వేసిందిరా'' ఒక్కపెట్టున ఏడవడం మొదలుపెట్టాడు వాడు.

''శ్రీమతీ!''

''అవునురా. అచ్చంగా అలాగే మారిపోయాను.'' ఇంకా ఏడవడం సాగించాడు.

చాలాసేపటిదాకా సర్దుకోలేదు. వాడ్ని ఓదార్చడం నాతరం కావడం లేదు. చివరాఖరికి ఏడుపు మానాడు. ఒక్కసారి శ్వాస ఎగపీల్చి, కళ్లు, ముక్కు తుడుచుకున్నాడు. ఆఖరి పెగ్ అమాంతం నోట్లో పోసుకున్నాడు. మొహంలో రంగులు మారాయ్. ఇదివరకు ఏడుపు కాస్తా పిచ్చినవ్వులోకి మారింది.

''ఏం ఫర్లేదు.. అంతపెద్ద సమస్యను కూడా చిటికెలో పరిష్కరించేశాను తెలుసా!'' వాటం వెకిలితనంగా మారింది. మాటల్లో నిర్లక్ష్యం కళ్లల్లోకి కూడా పాకింది.

''ఏం చేశావ్?''

''ఏం చేశాను...చెప్పుకో చూద్దాం.''

''నువ్వే చెప్పు. ఏం చేశావో..''

''ఏం చెయ్యడమేంట్రా ఫూల్... పెళ్లి చేసుకున్నాను.''

''ఈ స్థితిలో పెళ్లా...?!''

''అవును...పెళ్లే''

''ఎప్పుడు?''

''ఏడాది దాటింది.''

''నన్ను పిలవలేదేం?''

''నిన్నేంటి.. ఎవర్నీ పిలవలేదు. రహస్యంగా గుళ్లో చేసేసుకున్నాను.''

కళ్లు మూతలు పడుతున్నాయి. ఒళ్లు వాడి అధీనంలో లేదు. టేబిల్ మీదికి ఒరిగిపోతున్నాడు.

''పోనీలే... అమ్మాయి పేరేంటి.. ఏంచేస్తోంది?''

''మా ఆఫీసులోనే పనిచేస్తోంది. పేరు సతీ అగర్వాల్.''

''అదేంటి... తెలుగు పిల్ల కాదూ!''

''అసలు ఆడపిల్లే కాదంటుంటే.. ఆఫీస్‌లో వాడిపేరు వేరే'' టేబిల్‌పై తల పెట్టుకున్నాడు వాడు.

''ఏమిట్రా... నీ గోల తిన్నగా చెప్పు'' అన్నాను విసుగ్గా.

''అవునురా...నాపేరు మార్చుకోమని షరతు పెట్టినట్లే మా ఎండీ మా ఆవిడ్ని కూడా పేరు మార్చుకోవాలన్నాడు.''

''దేనికి?''

''ఆమెకి ఆండ్రోఫోనియా.''

''అంటే..?!''

''ఒరేయ్ సూరీ...అర్థం చేసుకోలేవూ..'' అంటూనే పూర్తిగా టేబుల్‌పై ఒరిగిపోతూ మత్తులో అదుపుతప్పి కిందపడ్డాడు...మిస్టర్ శ్రీమతి.

